క్లుప్తంగా

పోరంకిలో యువతి అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో యువతి అదృశ్యంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి వసంతనగర్‌లో వి.రత్నకుమారి తన ఇద్దరు పిల్లలతో ఉంటోంది. ఆమె ఇళ్లల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. అయితే ఆమెకు వేరే ప్రాంతంలో కాపలాదారు ఉద్యోగం రావటంతో అక్కడకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఈ నెల 7వ తేదీన కుమార్తె అనూష(19) ఇక్కడే ఉందామని కొత్త చోటకు రానని తల్లి రత్నకుమారితో గొడవ పడింది. ఆ తరువాత అనూష ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కారును ఢీ కొట్టిన లారీ

పెనమలూరు: పోరంకిలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై వెళుతున్న కారును లారీ ఢీ కొట్టడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకికి చెందిన బొప్పన రాజారావు శుక్రవారం తన కారులో పోరంకి నుంచి కంకిపాడు వైపునకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ డ్రైవర్ కనగాల రమేష్ ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కారు వెనుక భాగం ధ్వంసమయింది. ఈ ఘటనపై కారు యజమాని రాజారావు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ అవసరం



కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడు పట్టణంలో శనివారం దోమల నిర్మూలన ప్రత్యేక చర్యలు చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తితో అనారోగ్యం దరి చేరుతుందన్నారు. అలసత్వం వహించొద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

కానూరులో జాతీయ విద్యా దినోత్సవం

పెనమలూరు: కానూరు కేసీపీ సిద్దార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్ సిద్ధార్థ ఆంగ్ల విభాగం అధిపతి మండలపు రవిచంద్, పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ ఉత్సవ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గో గ్రీన్ దీపావళి అవగాహన ర్యాలీ



పెనమలూరు: కాలుష్య రహిత దీపావళి చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎన్ఎస్ఎస్, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో గో గ్రీన్ దీపావళి పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ బాణసంచా కాల్చటం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. మందుగుండు సామాను పేల్చటం వలన ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయని, ప్రమాదాలు కూడా జరుగుతాయన్నారు. గో గ్రీన్ దీపావళిలో భాగంగా సహజ సిద్ధంగా దీపావళి చేసుకోవాలని సూచించారు. మట్టి ప్రమిదలు వాడాలని, పూలతో ముగ్గులు వేయాలని కోరారు. ఆటపాటలతో దీపావళి సందడిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఈ నెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు బాపులపాడు మండలం వీరవల్లి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోడెబోయిన బాబి, గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో ప్రతిరోజూ పలు ప్రత్యేక కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హనుమాన్ జంక్షన్‌కు కొత్త వెలుగులు

- రూ.9.72 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు టెండర్లు
- రూ.1.44 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- రూ.23.28 లక్షలతో హైమాస్ట్ పోల్ లైటింగ్
- రూ.25.78 లక్షలతో డివైడర్‌పై స్టీల్ రెయిలింగ్
- రూ.86.73 లక్షలతో డ్రైనేజీ వ్యవస్థ



హనుమాన్ జంక్షన్ ప్రధాన కూడలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ సరికొత్త సొబగులు అద్దుకోనుంది. ప్రధాన రహదారుల్లో రూ.9.72 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేయనున్నాయి. దీర్ఘకాలంగా ప్రతిపాదనకే పరిమితమైన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. డివైడర్ రైలింగ్ ఏర్పాటు చేయనున్నారు. రహదారి మరమ్మతులతో పాటు అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఈ మేరకు నిధులు మంజూరు చేయటంతో పాటుగా టెండర్ నోటిఫికేషన్ కూడా గత నెలలో విడుదల చేసింది.

రూ.1.44 కోట్లతో మెయిన్ రోడ్లలో సెంట్రల్ లైటింగ్

హనుమాన్ జంక్షన్‌లోని ప్రధాన రహదారుల్లో రూ.1.44 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ రోడ్డు, ఏలూరురోడ్డు, గుడివాడ రోడ్డు, నూజివీడు రోడ్డులో కలిపి మొత్తం 5.2 కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్ల దూరంతో మొత్తం 150 స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. మూడు ప్రధాన కూడళ్లలో రూ.23.28 లక్షల వ్యయంతో హై మాస్ట్ పోల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేస్తారు. 16వ నంబర్ జాతీయ రహదారికి హనుమాన్ జంక్షన్ వద్ద బైపాస్ రోడ్డు నిర్మించటంతో ప్రస్తుత రోడ్డును పూర్తిగా అభివృద్ధి చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రోడ్డు మరమ్మతులు చేయటంతో పాటుగా రూ.25.78 లక్షల వ్యయంతో ప్రధాన రహదారుల మధ్యలోని డివైడర్‌పై స్టీల్ రైలింగ్ నిర్మించనున్నారు.

రూ.86.73 లక్షల వ్యయంతో డ్రైనేజీ వ్యవస్థ

హనుమాన్‌జంక్షన్‌లో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను సమూలంగా మార్పు చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ రూ.86.73 లక్షలతో ప్రణాళిక చేపట్టింది. ఇప్పటికే పలుచోట్ల ప్రధాన రహదారుల్లో ప్రస్తుత డ్రైనేజీ పూడిపోవటంతో కొద్దిపాటి వర్షానికి కూడా రోడ్డుపై నీళ్లు నిలిచిపోతూ వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో డ్రైనేజీ మరమ్మతులకు శ్రీకారం చుట్టడంతో జంక్షన్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఎన్‌హెచ్‌ఏఐ ద్వారా నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన హనుమాన్‌జంక్షన్ వాసి, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు, ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మువ్వా తిరుమల కృష్ణబాబును స్థానికులు అభినందిస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



స్వగ్రామంలో కలకాలం గుర్తుండే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని నా కోరిక. ఏపీ ఆర్డీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక జంక్షన్‌లో ప్రధాన రహదారుల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పట్టణ సుందరీకరణ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు ఎన్‌హెచ్‌ఏఐ రూ.9.72 కోట్ల నిధులు మంజూరుకు కృషి చేశాను. ఈ పనుల నిర్వహణకు ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్ కూడా విడుదల అయింది. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కనుమూరి సుబ్బరాజు, ఏపీ ఆర్డీసీ చైర్మన్

ట్రక్కు ఆటో, వ్యాన్ ఢీ

- ఆటో బోల్తా
- వ్యక్తికి తీవ్ర గాయాలు



ధ్వంసమైన ట్రక్కు ఆటో

కంకిపాడు: ట్రక్కుఆటో, వ్యాన్ ఢీకొన్న సంఘటన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద శనివారం తెల్లవారు జామున జరిగింది. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల మేరకు...ప్రొద్దుటూరు నుంచి కంకిపాడుకు కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న ట్రక్కుఆటో ప్రొద్దుటూరు రోడ్డు నుంచి కంకిపాడు వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న కోడి పిల్లల లోడు వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో ఆటో పక్కనే ఉన్న పల్లపు ప్రదేశంలోకి పల్టీ కొట్టింది. ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఆటో నడుపుతున్న బి.వెంకటేశ్వరరెడ్డికి (తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని అంబులెన్సులో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

గ్రామాల్లో దీపావళి సందడి



పోరంకిలో మందుగుండు సామగ్రి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



దుకాణాల్లో విక్రయిస్తున్న ప్రమిదలు, బొమ్మలు

- మండల పరిధిలో 60 బాణసంచా దుకాణాలు
- మట్టి ప్రమిదలు, బొమ్మల విక్రయం

పెనమలూరు: గ్రామాల్లో దీపావళి పండుగ సందడి చోటు చేసుకుంది. మండల పరిధిలో మొత్తం 60 మందుగుండు సామాను విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేశారు. కానూరు, మురళీనగర్, పోరంకి, పెనమలూరు, గోసాల ప్రాంతాల్లో మందుగుండు దుకాణాలు పెట్టారు. ఈ దుకాణాల వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇక మట్టి ప్రమిదలకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీపావళికి కొత్త మట్టి ప్రమిదలు పెట్టాలని నమ్మకం ఉండటంతో మట్టి ప్రమిదలు విక్రయించే దుకాణాలు కూడా చాలా పెట్టగా మహిళలు వచ్చి మట్టి ప్రమిదలు కొంటున్నారు. రంగురంగుల బొమ్మలు, పూలు, స్వీట్లు కూడా పెద్ద ఎత్తున విక్రయాలు జరుగుతున్నాయి. వాణిజ్య, వ్యాపార కేంద్రాకు రంగురంగు దీపాలతో అలంకరించారు. ఆదివారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపనున్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో మెస్‌ను పరిశీలిస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గీతాబాయి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గురుకుల పాఠశాలలోని డార్మిటరీ, చేతులు శుభ్రం చేసుకునే పరిసరాలు, మెస్, అకడమిక్ బ్లాక్, బాత్రూంలు పరిశీలించారు. భోజనశాలలో వంటకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, కూరగాయలు పరిశీలించారు.

మెట్లపల్లిలో పర్యటన

ఆత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని మెట్లపల్లి గ్రామంలో చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, ఫ్యామిలీ డాక్టర్స్ ప్రోగ్రాంను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. చిన్న పిల్లలకు వేసే వ్యాక్సిన్‌ల పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలని, వారికి జబ్బులు రాకుండా కాపాడేందుకు వ్యాక్సిన్‌లు సక్రమంగా వేయించాలని ఆదేశాలిచ్చారు. గర్భిణులు, బాలింతలు రిజిస్ట్రేషన్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలామ్ జయంతి



దుర్గాపురంలో నోట్‌బుక్‌లు అందుకున్న విద్యార్థులు



ఉంగుటూరులో మౌలానా జయంతి నిర్వహిస్తున్న ముస్లిం పెద్దలు, ఎంపీడీవో శేషగిరిరావు

ఉంగుటూరు: విద్యకు పునాదులు ఏర్పరచిన విద్యావేత్త, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మౌలానా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని దాదాపు 10 ఏళ్లు జైలు శిక్ష అనుభవించారని, స్వాతంత్ర్యం అనంతరం మొట్టమొదటి విద్యాశాఖా మంత్రిగా 11 ఏళ్ల పాటు పనిచేసి దేశంలో విద్యా సంస్కరణలకు విశిష్టమైన కృషి చేశారన్నారు. మౌలానా చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం ఆయన్ను భారతరత్నతో గౌరవించిందన్నారు. తొలుత మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగవరప్పాడు గ్రామ సర్పంచ్ షేక్ పెద నాగూర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాంకు ఘన నివాళి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో ఉన్న దారుల్ ఉలూమ్ షఫీకియా మదర్సాలో శనివారం భారత తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. రామానుజన్ అకాడమీ ఆధ్వర్యంలో అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్‌లు, విద్యా సామగ్రి అందజేశారు. అనంతరం 47 ఏళ్ల వయస్సులో డిగ్రీ పూర్తిచేసిన మౌలానా హుసేన్ అహ్మద్‌కు, పదవ తరగతి ఉత్తీర్ణులైన మదరసా విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నేత ఫారూక్ షుబ్లీ, అకాడమీ అధ్యక్షుడు పఠాన్ ముస్తఫా, సమితి రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రావు, సామాజిక కార్యకర్త ఉమర్ ఫారూఖ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బెంజిసర్కిల్‌లో కాకాని విగ్రహం ఏర్పాటుకు కృషి



దేవినేని అవినాష్‌కు కాకాని జ్ఞాపికను అందిస్తున్న తరుణ్ కాకాని, విజయ్‌కుమార్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, జై ఆంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఉక్కు కాకానిగా పేరుగాంచిన మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని బెంజిసర్కిల్‌లో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఇటీవల విగ్రహ ఏర్పాటు అంశంపై నగరపాలకసంస్థ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అందుకు కృషి చేసిన దేవినేని అవినాష్‌ను శనివారం కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన కార్యక్రమంలో దేవినేని అవినాష్ మాట్లాడారు. కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని విజయవాడ నగరంలో తిరిగి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. దీనికి అనుగుణంగానే ఇటీవల జరిగిన నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశంల్లో విగ్రహ ఏర్పాటుకు తీర్మానించారని చెప్పారు. విగ్రహ ఏర్పాటుకు దేవినేని అవినాష్ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ, డిసెంబరు 25 లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాకాని ఆశయ సాధన సమితి సభ్యులు కోరారు. కార్యక్రమంలో కాకాని ఆశయ సాధన సమితి ప్రెసిడెంట్ కాకాని తరుణ్, కాకాని విజయకుమార్, మోతుకూరి వెంకటేశ్వరరావు, కోనేరు బసవేశ్వరరావు, ధనేకుల చంద్రశేఖర్, గుమ్మడి రామకృష్ణ, బేతు రామ్‌మోహన్, అవధానుల హరి, మేడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం బాణసంచా విక్రయాలు జరపాలి

గన్నవరం: బాణసంచా విక్రయ వ్యాపారులు తప్పనిసరిగా అగ్నిమాపక, భద్రత నిబంధనలను పాటించాలని సీఐ పి.కనకరావు సూచించారు. జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు శనివారం ఆయన స్థానిక వీఎస్ పురం కాలనీ రోడ్డులోని బాణసంచా విక్రయ గోడౌన్, హరివిల్లు వెంచర్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా స్టాల్స్‌ను తనిఖీ చేశారు. స్టాల్స్ వద్ద ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బాణసంచా విక్రయ స్టాల్స్‌ను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బీబీ గూడెం వద్ద బాణసంచా గోడౌన్ కూడా సీఐ పరిశీలించారు.

నలందలో ఉత్సాహంగా ముందస్తు దీపావళి

కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో దీపావళి పర్వదినాన్ని విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. విద్యార్థులకు ఫ్యాషన్ షో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేక వేషధారణలో చేసిన నృత్యాలు అలరించాయి. నరకాసురుని బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలన్నారు.

పూజారిపై ముగ్గురు వ్యక్తుల దాడి

పెనమలూరు: పోరంకి శివాలయంలో పూజారి అయిలూరి పూర్ణ సుమంత్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం శివాలయంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో మైక్ సౌండ్ తగ్గించాలని స్థానికంగా నివశిస్తున్న వంగూరు బ్రహ్మేశ్వరరావు, వంగూరు మురళి, వంగూరు సుబ్బారావు పూజారి పూర్ణ సుమంత్‌ను అడిగారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు వ్యక్తులు పూజారిపై దాడి చేశారు. పూజారి ఫిర్యాదుమేరకు రంగంలోకి దిగిన సీఐ రామారావు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.ఈ ఘటనపై ఆలిండియా శివాచార్య సేవా సంఘం, అర్చక సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

14 నుంచి తెన్నేరులో గ్రంథాలయ వారోత్సవాలు

కంకిపాడు: కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెన్నేరు శాఖా గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.సునీత తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రంథాలయంలో 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీన బాలల నేస్తం చాచా నెహ్రూ జయంతి వేడుకలు, 15న చాచా నెహ్రూపై వ్యాసరచన పోటీలు, నీతి పద్యాల పోటీలు నిర్వహిస్తారన్నారు. 16న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 17న విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు, 18న లెమన్ అండ్ స్పూన్ పోటీలు, 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ఉయ్యూరు: విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ సూచించారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ బకాయిల వసూళ్లు, భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై శనివారం సమీక్షించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ వినియోగదారులు సకాలంలో బకాయిలు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. విద్యుత్ బిల్లులను మొబైల్ యాప్‌లలోనూ చెల్లించుకోవచ్చన్నారు. కరెంటు బిల్లు అందించిన 14 రోజుల్లోపు చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది బకాయిల వసూళ్లలో శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలు విద్యుత్ పొదుపు చర్యలు పాటించాలని కోరారు. ఏసీల వినియోగంలో జాగ్రత్తలు వహించాలన్నారు. పొలాలకు ఇనుప కంచె ఏర్పాటుచేసుకునే రైతులు ఆ కంచెకు విద్యుత్ సరఫరా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912కి ఫోన్ చేసి సంప్రదించవచ్చని చెప్పారు.

అనుమతులు లేని బాణసంచా దుకాణాలపై దాడి

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా బాణసంచా అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం శనివారం గ్రామాల్లో తనిఖీలు చేస్తున్న సమయంలో కానూరు, సనత్‌నగర్, పోరంకి, యనమలకుదురు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచి బాణసంచా విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సరుకు సీజ్ చేశామన్నారు. భద్రత దృష్ట్యా సురక్షిత ప్రాంతాల్లోనే బాణసంచా అమ్మకాలకు అనుమతులు ఇచ్చామని, చట్టవిరుద్ధంగా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఏపీపీలు, ఏజీపీల నియామకం

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): విజయవాడలోని కోర్టు సముదాయంలో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న పలువురు న్యాయవాదులకు ఏపీపీలు, ఏజీపీలుగా నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో జంగా జయలక్ష్మిని 3వ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, గుజ్జర్ల భాస్కరరావును 12వ కోర్టు అడిషనల్ ప్రాసిక్యూటర్‌గా, దాసరి ఆంజనేయ ప్రసాద్‌ను సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా, షేక్ ఖాదర్‌వలీని ఎల్ఎల్ఆర్‌ఏ కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా పదోన్నతులు పొందారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పదోన్నతులు రావటంలో కృషి చేసిన ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయిరాం, జోనల్ ఇన్‌చార్జి ఒగ్గు గవాస్కర్, సభ్యులు న్యాయవాదులకు అభినందనలు తెలిపారు.

CHANGE OF NAME

I, MORAMPUDI BARAVA PURVA (Old name) W/o MORAMPUDI VENKATA APPALA RAJU, Residing in Door No: 7-89/1, Near Sai Gowtham School, Bapulapadu village, Bapulapadu Mandal, Krishna District, Andra Pradesh, South India. Henceforth be known/called as MORAMPUDI BASAVA PURNA (New Name). This may be noted by one and all that, for all my future correspondence/ transactions I shall be known/called as MORAMPUDI BASAVA PURNA (New Name).